సాక్షి విశాఖపట్నం

బుధవారం । 11 । జనవరి । 2023



IIలో



గురుకులం సంఘటనలో బాధ్యులపై చర్యలు

ఏపీ సాంఘిక సాంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీ సంజీవిరావు

IIలో

న్యూస్‌రీల్

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

ఆర్‌ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: జూనియర్ **కాలేజీలకు** బుధవారం నుంచి ఈ నెల 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఆర్.సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు తప్పనిసరిగా బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలన్నారు. సంక్రాంతి సెలవుల్లో ఎటువంటి తరగతులను నిర్వహించడానికి వీల్లేదన్నారు. ప్రైవేటు కాలేజీలపై నిఘా పెట్టామని, ఎక్కడైనా ప్రత్యేక తరగతులను నిర్వహించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు పది పరీక్షలపై సమీక్ష

విశాఖ విద్య: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. వెబెక్స్ ద్వారా పరీక్షల విభాగం రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్వహించే సమీక్షలో జిల్లాలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సమీక్ష ఉంటుందన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు.

ముగిసిన సమ్మేటివ్ పరీక్షలు

విశాఖ విద్య: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఈ నెల 5 నుంచి ప్రారంభమైన సమ్మేటివ్–1 పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. జవాబు పత్రాల మూల్యాంకనం సకాలంలో పూర్తి చేసి, విద్యార్థులు సాధించిన మార్కులను సీఎస్‌సీలో పొందుపరచాలని విద్యాశాఖాధికారులు సూచించారు. కాగా అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రశ్నాపత్రాలతోనే పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, విశాఖ నగరంలోని కొన్ని ప్రైవేటు స్కూళ్లలో దీన్ని అమలు చేయలేదని విద్యాశాఖాధికారుల దృష్టికి వచ్చింది. దీనిపై డీసీఈబీ విభాగం అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇదే విషయమై ఓ ప్రైవేటు స్కూల్ నిర్వాహకులను డీఈవో కార్యాలయానికి పిలిపించిన అధికారులు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతిపై పరువు నష్టం కేసు 3కి వాయిదా

విశాఖలీగల్ : ఆంధ్రజ్యోతి దిన పత్రికపై నగరంలోని ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన పరువు నష్టం కేసు ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా పడింది. కేసులో పేర్కొన్న నేరారోపితులు కోర్టుకు హాజరుకాలేదు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి సిహెచ్.యుగంధర్ కేసు వాయిదా వేశారు. కేసులో పేర్కొన్న ముద్దాయిలు ఆంధ్రజ్యోతి యజమాని వేమూరి రాధాకృష్ణ, అప్పటి సంపాదకుడు కె.శ్రీనివాస్, ఏబీఎన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కె.శివప్రసాద్ వచ్చే నెల 3న తప్పనిసరిగా న్యాయస్థానానికి హాజరు కావాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. 2011లో 'పత్రిక పేరుతో పాగా' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురణమైన కథనంపై శశాంక్ మోహన్ తొమ్మిది మందిపై క్రిమినల్ డిఫమేషన్ కేసు ఫైల్ చేసిన విషయం తెలిసిందే.

సంక్రాంతి స్పెషల్స్ రెడీ!

- 550 బస్సులను నడపనున్న ఆర్టీసీ
- హైదరాబాద్ నుంచి మొదలైన సర్వీసులు
- ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే..
- అడ్వాన్స్ టికెట్ రిజర్వేషన్లకు డిమాండ్

సాక్షి, విశాఖపట్నం: సంక్రాంతి పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను సిద్ధం చేసింది. ఈ పండగకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే, వెళ్లే వారి కోసం విశాఖ నుంచి 550 స్పెషల్ బస్సులను నడపనుంది. సంక్రాంతికి హైదరాబాద్ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి రోజుకు ఐదు రెగ్యులర్ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో రోజుకు 177 చొప్పున ఉన్న సీట్లు ఈనెల 13వ తేదీ వరకు నూరు శాతం భర్తీ అయ్యాయి. సోమవారం విశాఖపట్నం నుంచి కొన్ని స్పెషల్ బస్సులను హైదరాబాద్ పంపారు. మంగళవారం అక్కడ నుంచి ఇవి బయలుదేరాయి. హైదరాబాద్ నుంచి 14వ తేదీ వరకు 35 స్పెషల్ బస్సులను అందుబాటులో ఉంచింది. వీటిలో 90 శాతానికి పైగా సీట్లు ఇప్పటికే అడ్వాన్సు రిజర్వేషను చేయించుకున్నారు. మరో వైపు తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్లే వారి కోసం ఈనెల 15, 16, 17 తేదీల్లో రోజుకు నాలుగు చొప్పున ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. వీటిలో సీట్ల కోసం అడ్వాన్సు రిజర్వేషన్లు జరుగుతున్నాయి. ఇవికాకుండా రెగ్యులర్‌గా రోజుకు ఐదు బస్సులు ఇక్కడ నుంచి నడుస్తున్నాయి. వీటిలో చాలావరకు సీట్లు ఇప్పటికే భర్తీ అయ్యాయి.



ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి..

హైదరాబాద్‌తో పాటు విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, భీమవరం, పార్వతీపురం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట తదితర ప్రాంతాలకు నడపడానికి ఆర్టీసీ అధికారులు అవసరమైన బస్సులను సిద్ధం చేశారు. రెగ్యులర్ బస్సులకు మించి ప్రయాణికులుంటే ప్రత్యేక బస్సులు నడుపుతారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి బుధవారం నుంచే వీటిని నడపడానికి చర్యలు తీసుకున్నామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) అప్పలరాజు 'సాక్షి'తో చెప్పారు. ఈసారి స్పెషల్ బస్సుల్లో మునుపటిలా టిక్కెట్టుపై 50 శాతం అదనపు చార్జీ వసూలు చేయడం లేదని, ఇది ప్రయాణికులకు ఊరటనిచ్చే అంశమని తెలిపారు.

గత సంక్రాంతి కంటే ఎక్కువ స్పెషల్స్

గత సంక్రాంతికి అప్పటి విశాఖ రీజియన్ నుంచి 492 ప్రత్యేక బస్సులను నడిపారు. అప్పటికి కోవిడ్ మూడో వేవ్ పూర్తిగా తొలగకపోవడంతో ప్రయాణికుల తాకిడి తగ్గింది. ప్రస్తుతం కోవిడ్ ఛాయలు లేకపోవడంతో మళ్లీ సాధారణ పరిస్థితికి వచ్చింది. దీంతో గత సంక్రాంతి కంటే ఈసారి ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ఏడాదికన్నా 68 స్పెషల్స్‌ను పెంచారు.

సంక్రాంతికి ఎక్కడకు ఎన్ని స్పెషల్ బస్సులు?

ఎక్కడకు	2022	2023
అమలాపురం	6	9
జీహెచ్‌ఈఎల్	38	40
భీమవరం	7	4
ఇచ్ఛాపురం	10	20
కాకినాడ	16	20
పాలకొండ	53	55
పలాస	32	35
పార్వతీపురం	87	90
రాజమండ్రి	65	75
రాజాం	17	20
రాజోలు	2	2
సాలూరు	7	10
శ్రీకాకుళం	73	75
విజయవాడ	53	65
విజయనగరం	19	20
సోంపేట	7	10
మొత్తం	492	550

చార్జీల బాదుడుపై కొరడా!

- రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్
- 17 వరకు ప్రైవేటు బస్సుల తనిఖీలు
- నిబంధనల ఉల్లంఘనపై కేసులు



అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద ప్రైవేటు బస్సుల రికార్డులను పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు

సాక్షి, విశాఖపట్నం: సంక్రాంతిని 'పండగ' చేసుకునే ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ కొరడా ఝుళిపిస్తోంది. సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య విపరీతంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు ఆపరేటర్లు బస్సులను నడుపుతుంటారు. ఈ బస్సుల్లో సాధారణం కంటే అధిక చార్జీలను వసూలు చేస్తుంటారు. సంక్రాంతికి వచ్చే అధిక ఆదాయాన్ని వదులుకోలేక తగిన ధృవపత్రాలు లేకుండా, ప్రభుత్వానికి నిర్ణీత పన్నులు చెల్లించకుండా బస్సులను తిప్పుతుంటారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారులు తొక్కే ప్రైవేటు ట్రావెల్స్‌కు అడ్డుకట్ట వేయడానికి రవాణాశాఖ అధికారులు దాడులు చేస్తున్నారు. ఈనెల 9వ తేదీ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో లగేజీ రవాణా చేస్తున్నా, ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నా కేసులు పెడుతున్నారు. ఇంకా ఈ ట్రావెల్స్ బస్సుల డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. సంబంధిత బస్సుకు ట్యాక్స్‌లు చెల్లించారో లేదో చూస్తున్నారు. అలా చెల్లించని బస్సులను సీజ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే బస్సు ఆపరేటర్లకు రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్నాటక, తమిళనాడుల నుంచి విశాఖపట్నం వైపు వచ్చే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను అగనంపూడి టోల్ ప్లాజా వద్ద విశాఖ జిల్లా రవాణా శాఖ అధికారులు ప్రతి రోజూ సాయంత్రం నుంచి మర్నాడు ఉదయం వరకు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. ఇందుకోసం రవాణా శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు నిబంధనలు ఉల్లంఘించి నడుస్తున్న 35 బస్సులపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా తిప్పుతున్న మూడు బస్సులను సీజ్ చేశారు. రూ.2.63 లక్షల జరిమానా విధించి వసూలు చేశారు. సంక్రాంతి పేరిట ప్రయాణికుల నుంచి అధికంగా చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని, అలాంటి వారు రవాణా శాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ జి.సి.రాజారత్నం కోరారు. ఈ తనిఖీలు ఈనెల 17వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు.

ఆస్పత్రుల అభివృద్ధికి నిధుల మంజూరు

- కేజీహెచ్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- ఓపీ కౌంటర్ వికేంద్రీకరణకు కలెక్టర్ ఆదేశాలు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): జిల్లాలో పలు ఆస్పత్రుల అభివృద్ధిపై కలెక్టర్ మల్లికార్జున సమీక్షించారు. మంగళవారం కేజీహెచ్ సమావేశ మందిరంలో కేజీహెచ్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రుల అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ పలు మార్గదర్శకాలు జారీ చేశారు. కేజీహెచ్‌లో పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. కేజీహెచ్‌కు సంబంధించి సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ అజెండా అంశాలను ప్రస్తావించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీకి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేజీహెచ్‌లో రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు, చికిత్సలు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఎంఆర్‌ఐ స్కానింగ్ మెషీన్ రావడానికి కొంత ఆలస్యం అవుతుందని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవుట్ సోర్సింగ్ ద్వారా సేవలను అందించాలన్నారు. పిడియాట్రిక్ వార్డులో పీజీ విద్యార్థులకు టాయిలెట్స్ కోసం రూ.4 లక్షలు, కేజీహెచ్‌లోని సుబ్బిరామిరెడ్డి సత్రం మరమ్మతులకు అనుమతి మంజూరు చేశారు. ఆస్పత్రి పవర్, వాటర్ బిల్ కోసం అధికంగా ఖర్చు అవుతోందని సూపరింటెండెంట్ కలెక్టర్‌కు తెలపగా, సోలార్ పవర్ కోసం గత సమావేశంలోనే అనుమతి మంజూరు చేశామని, ఇంకా ఎందుకు పనులు చేపట్టలేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల నుంచి రూ.50 లక్షలు, సీఎస్సార్ ద్వారా రూ.20 లక్షల ఇస్తున్నట్టు తెలిపారు. హెచ్‌పీసీఎల్ ద్వారా త్వరలోనే పది కొత్త అంబులెన్సులు కేజీహెచ్‌కు రానున్నాయన్నారు. యురాలజీ విభాగంలో యంత్రాల కొనుగోలుకు రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఓపీ కౌంటర్లను వికేంద్రీకరణ చేసి రోగులకు సౌకర్యవంతంగా ఉండేలా మార్చాలన్నారు. క్యాజువాలిటీ వద్ద ఫౌంటేన్, గార్డెనింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. సూపరింటెండెంట్ పేర్కొన్న పలు రకాల పనులకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు వెంటనే ప్రతిపాదనలు పంపి పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేజీహెచ్‌లో మొత్తం 28 పనులకు గాను రూ.2.98 కోట్లకు కలెక్టర్ అనుమతి మంజూరు చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్

- ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రతి రోజు 300 ఓపీ సేవలు, 30 సర్జరీలు నిర్వహిస్తున్నామన్నారు. గత సమావేశంలో మంజూరు చేసిన జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ పనులు పూర్తి అయినట్టు వివరించారు. 2 పనులకు గాను రూ.27 లక్షలు కలెక్టర్ మంజూరు చేశారు.
- ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ఉషా పేర్కొన్న అత్యవసర పనులకు కలెక్టర్ అనుమతులు మంజూరు చేశారు. విక్టోరియా ఆస్పత్రిలో రెండు పనులకు గాను రూ.4.50 లక్షలకు అనుమతి ఇచ్చారు. ఈ సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ బీప నాయుడు, కమిటీ సభ్యులు కుమార్ రాజా, ఆనంద్ సింఘ్, వైద్యాధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ మల్లికార్జున సూచించారు. మంగళవారం పెద వాల్తేరు ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రిలో ఛాతి, ఈఎన్‌టీ, మానసిక, ఆర్‌సీడీ ఆస్పత్రుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆస్పత్రుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఛాతి ఆస్పత్రిలో మొత్తం 14 పనులకు రూ.16 లక్షలు, ఈఎన్‌టీ ఆస్పత్రిలో 17 పనులకు రూ.19 లక్షలు, రాణి చంద్రమణి దేవి ఆస్పత్రిలో 4 పనులకు రూ.16.09 లక్షలు, ప్రభుత్వ మానసిక వైద్యశాలల్లో 6 పనులకు రూ.34.54 లక్షలకు అనుమతులు మంజూరు చేశారు.



వీఎంఆర్‌డీఏ షాపుల వేలానికి విశేష స్పందన

- 35 దుకాణాలకు 27 కేటాయింపు
- రూ.26.74 లక్షల ఆదాయం

దొండపర్తి(విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏ షాపుల వేలానికి విశేష స్పందన వచ్చింది. 35 దుకాణాలకు వేలం నిర్వహించగా 27 షాపులు కేటాయింపులు చే శారు. వీటి ద్వారా సంస్థకు ప్రతి నెల రూ.26.74 లక్షలు ఆదాయం సమకూరనుంది. వీఎంఆర్‌డీఏ రాంనగర్‌లో నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయాలు, వైఎస్సార్ సెంట్రల్ పార్క్ వద్ద 12 దుకాణాలు, అలాగే టీయూ–142 మ్యూజియంలో సావనీర్ షాపునకు మంగళవారం చిల్డ్రన్స్ ఎరీనాలో వేలం ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 35 షాపులు అద్దెకు ఇచ్చేందుకు డిసెంబర్ 30వ తేదీన నోటిఫికేషన్ ఇవ్వగా 327 మంది వేలంలో పాల్గొన్నారు. ఇందులో టీయూ–142 ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియంలో సావనీర్ షాప్‌నకు రూ.66,481 అప్‌సెట్ ధరగా నిర్ణయించగా దానికి రూ.2.23 లక్షలు అత్యధిక ధర పలికింది. అలాగే వైఎస్సార్ సెంట్రల్ పార్క్ వద్ద ఉన్న 8 షాపులకు అప్‌సెట్ ధర రూ.7,875గా ఉండగా.. రూ.8,200 నుంచి రూ.30,600 వరకు బిడ్ వేసి సొంతం చేసుకున్నారు. రాంనగర్ సైట్–2 మూడు ఫ్లోర్లకు రూ.4.8 లక్షలు, నాలుగో అంతస్తుకు రూ.1.06 లక్షలు, ఐదో అంతస్తుకు రూ.1.26 లక్షలు ధర పలికింది. రాంనగర్ సైట్–1లో గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపుల సైజు విస్తీర్ణాన్ని బట్టి రూ.1.08 లక్షల నుంచి రూ.4.56 లక్షలకు పాడుకున్నారు. మొదటి అంతస్తులో మూడు షాపులకు రూ.58,500 నుంచి రూ.1.92 లక్షలు, అలాగే మూడో అంతస్తులో షాపునకు రూ.43 వేలుకు బిడ్ వేసి దక్కించుకున్నారు. ఇలా మొత్తంగా 27 షాపులకు గాను రూ.26,74,500 నెలసరి అద్దెల రూపంలో వీఎంఆర్‌డీఏకు ఆదాయం సమకూరనుంది. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, కార్యదర్శి టి.వేణుగోపాల్, అకౌంట్స్ ఆఫీసర్ నిర్మలమ్మ, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.



పేదలందరి ఇళ్లకు రూ.200 కోట్లు

- సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట
- అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్ల అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్
- వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో మొత్తం ఏడు అంశాలకు ఆమోదం

దొండపర్తి (విశాఖ దక్షిణ): 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో లేఅవుట్ల అభివృద్ధికి రూ.200 కోట్లు మంజూరు చేస్తూ విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) నిర్ణయం తీసుకుంది. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అధ్యక్షతన సంస్థ సమావేశ మందిరంలో బోర్డు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఇందులో ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, జిల్లా కలెక్టర్, మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఏపీఈపీడీసీఎల్ చైర్‌పర్సన్ కె.సంతోషరావు, డీటీసీపీ డైరెక్టర్ ఆర్.జె.విద్యుల్లత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కలను నిజం చేసేందుకు రూ.వందల కోట్లతో లేఅవుట్ల అభివృద్ధి చేసేందుకు పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. అలాగే మరోవైపు రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అంశాలపై కూడా చర్చించి మొత్తం ఏడు అంశాలకు ఆమోదముద్ర వేశారు.

- 'జగనన్న హరిత నగరాలు'లో భాగంగా ఎన్‌హెచ్–16 జంక్షన్ నుంచి పేబిల్ బీచ్ హౌసింగ్ జంక్షన్ (వయా లా కాలేజీ) వరకు 3.10 కిలోమీటర్లు పొడవున రహదారి అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు మంజూరు.



వీఎంఆర్‌డీఏ సమావేశంలో చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, అధికారులు

- జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్ పథకంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో చోడవరం మండలం అడ్డూరు గ్రామంలో 19.99 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధికి రూ.11.40 కోట్లు మంజూరు
- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వివిధ మండలాల్లో రూ.200 కోట్లతో లేఅవుట్ల అభివృద్ధి
- 'జగనన్న టౌన్‌షిప్ పథకం' పథకంలో భాగంగా విజయనగరం జిల్లా గరివిడి గ్రామంలో రూ.21.3 కోట్లతో 21.3 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్ల అభివృద్ధి
- రూ.1.98 కోట్లతో పెబుల్ బీచ్ అపార్ట్‌మెంట్ల నుంచి ఐటీ సెజ్ రోడ్డు వరకు 80 అడుగుల రహదారికి ఇరువైపులా అలంకారమైన ఎంఎస్ గ్రిల్, సెంట్రల్ డివైడర్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం
- జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పథకంలో భాగంగా రూ.11 కోట్లతో విశాఖ జిల్లా పాలవలస గ్రామంలో 22.02 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్‌లో మౌలిక సదుపాయల అభివృద్ధి
- వీఎంఆర్‌డీఏ అమ్మకానికి ప్రతిపాదించిన 8 బల్క్ ల్యాండ్ ప్లాట్లను మెరుగైన విక్రయ సామర్థ్యం కల్పించేలా చిన్న బిట్‌లుగా విభజనకు పరిపాలన అనుమతులు

వరుస దాడులు వెనుక ఏం జరిగింది?

- రాష్ట్ర పన్నుల శాఖ కమిషనర్ రమేష్ విచారణ
- రెండు రోజుల పాటు రికార్డుల పరిశీలన

సాక్షి, విశాఖపట్నం : నెల రోజుల క్రితం పెందుర్తి సమీపంలో భారీగా నకిలీ సిగరెట్లను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. కానీ.. అవి రికార్డుల్లో కనిపించలేదు. అనకాపల్లి– పెందుర్తి జాతీయ రహదారిపై జీఎస్టీ ఎగవేతకు పాల్పడుతూ వెళ్తున్న స్క్రాప్ లారీలను పట్టుకున్నారు. అవి కూడా స్టేట్ ట్యాక్స్ రికార్డుల్లో మాయమయ్యాయి. అంతే కాదు.. దసరా, దీపావళి పండగల సమయంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, సిబ్బంది వసూల్ రాజాల అవతారమెత్తారు. అందిన కాడికి దండుకున్నారన్న ఆరోపణలతో పాటు పీల్చి పిప్పి చేస్తున్నారంటూ వ్యాపారుల నుంచి ఉన్నతాధికారులకు వరుస ఫిర్యాదుల నేపథ్యంలో రహస్య విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల పేరుతో దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేటతెల్లమైంది. కొద్ది రోజుల క్రితం ఈ ఆరోపణలపై విచారణ పూర్తి చేసి.. డీసీ జయశంకర్‌తో పాటు ఇద్దరు ఏసీటీవోలు, సీనియర్ అసిస్టెంట్స్‌ను సస్పెండ్ చేశారు. మిగిలిన డివిజన్లలోనూ ఇదే తరహా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆశాఖ కమిషనర్ డి.రమేష్ విజయవాడ నుంచి వచ్చి రెండు రోజుల పాటు విశాఖపట్నం జాయింట్ కమిషనరేట్‌లోనే తిష్టవేశారు. ఈ వ్యవహారాలన్నింటిపైనా విచారణ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ఇతర సర్కిళ్ల పరిధిలో ఎవరెవరు వసూళ్లకు పాల్పడుతున్నారన్న అంశాలపైనా దర్యాప్తు చేపట్టారు. కొందరు ట్రేడర్లతో కమిషనర్ రమేష్ మాట్లాడి ఆయా సర్కిల్స్ పరిధిలో జరుగుతున్న వ్యవహారాల గురించి ఆరా తీశారు.

వరుస దాడుల వెనుక మర్మమేంటి..?

కొద్ది నెలల క్రితం బదిలీ అయిన విశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాసరావు సమయంలో భారీగా దాడులు నిర్వహించారు. రూ.కోట్లు విలువ చేసే గార్మెంట్స్, నకిలీ సిగరెట్లు, స్క్రాప్, ఇతర సామగ్రిని పన్నులు లేకుండా తరలిస్తుండగా పట్టుకున్నారు. నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించారంటూ మైనింగ్ కంపెనీలపైనా చర్యలకు ఉపక్రమించారు. కొద్ది మంది టీమ్‌ని ఏర్పాటు చేసుకొని వారి ద్వారానే ఈ దాడులు నిర్వహించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయన హయాంలో భారీగా దాడులు నిర్వహించడం వెనుక స్వప్రయోజనాలు కూడా దాగి ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఫిర్యాదులు రావడంతో కమిషనర్ రమేష్ రెండు రోజుల పాటు విశాఖ డివిజన్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఆ సమయంలో నిర్వహించిన దాడులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయా దాడులకు సంబంధించిన రికార్డులతో పాటు.. ఆ దాడుల్లో ఎవరెవరు పాల్గొన్నారనే అంశాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సదరు జేసీ టీమ్ సభ్యులని కూడా వ్యక్తిగతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం.



గురుకులం సంఘటనలో బాధ్యులపై చర్యలు

ఏపీ సాంఘిక సాంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీ సంజీవిరావు



గురుకులాల డీసీ, ప్రిన్సిపాల్, పోలీసుల సమక్షంలో విద్యార్థులతో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ కేంద్ర కారాగారం పక్కన శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఆదివారం జరిగిన సంఘటనపై బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఏపీ సాంఘిక సాంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీ సంజీవి రావు తెలిపారు. ఇక్కడ జరిగిన సంఘటనపై నివేదిక తయారు చేయడానికి గురుకులాల కార్యదర్శి పి.పవన్‌మూర్తి ఆదేశాలతో ఆయన మంగళవారం అమరావతి నుంచి వచ్చి గురుకులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గురకులంలో భోజనాలు గది, డార్మెటరీ, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. ఆదివారం జరిగిన సంఘటనపై గురుకులాల డీసీ ఎస్.రూపావతి, ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్‌తో మాట్లాడి తెలుసుకొన్నారు. జరిగిన సంఘటనపై మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల మధ్య కొట్లాట జరగడం దురదృష్టకరమన్నారు. ఇది క్రమశిక్షణా రాహిత్యానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొట్లాటకు కారణమైన విద్యార్థుల పైనా, సక్రమంగా విధులు నిర్వర్తించని సిబ్బంది పైనా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. పదో తరగతి విద్యార్థిపై దాడిచేసిన ఆరుగురు ఇంటర్ విద్యార్థులను సస్పెండ్ చేస్తామన్నారు. ప్రస్తుతం వారిని మంగళవారం వారి తల్లిదండ్రులకు అప్పగించి ఇంటికి పంపించేశామని తెలిపారు. ఇక్కడ ప్రిన్సిపాల్, ఆ రోజు విధుల్లో ఉండాల్సిన అధ్యాపకులపై చర్యలకు నివేదిక సిద్ధం చేసి గురుకులాల కార్యదర్శికి పంపిస్తామన్నారు. అనంతరం ఉన్నతాధికారుల నంచి వచ్చే ఉత్తర్వుల ప్రకారం సిబ్బందిపై చర్యలు చేపడతామన్నారు. విద్యార్థులకు నిరంతరం కౌన్సిలింగ్, అవగాహన కల్పించాలన్నారు.

బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సందర్శన

శ్రీకృష్ణాపురం గురుకులాన్ని మంగళవారం ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సందర్శించారు. ఈ సందర్భంగా డీసీ రూపావతి, ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్, ఆరిలోవ సీఐ ఇమాన్యుయేల్ రాజుతో కలిసి ఇక్కడ గొడవకు కారణమైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. కారణాలు తెలుసుకొన్నారు. ఇంకెప్పుడూ గొడవలకు దిగబోమని విద్యార్థులు నుంచి వారి తల్లిదండ్రుల సమక్షంలో రాత పూర్వకంగా లెటర్లు తీసుకొన్నారు. దీనిపై సేకరించిన వివరాలతో నివేదిక తయారుచేసి కమిషన్‌కు పంపిస్తామన్నారు. ఆరిలోవ సీఐ ఇమాన్యుయేల్ రాజు మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులకు తరుచూ అవగహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబేషన్ అధికారి శరత్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సెల్వియా, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి సభ్యుడు పారిపల్లి రామారావు, ఐసీపీయూ ప్రతినిధి ఆనంద్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శకుంతల, గురుకులం పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాకర గోవింద్, ఉపాధ్యాయురాలు సీలవేణి పాల్గొన్నారు.

వెల్లివిరిసిన పల్లె సోయగం



విద్యార్థులతో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న అధ్యాపకులు



సంక్రాంతి సందడితో కళాశాల ప్రాంగణం

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : సంక్రాంతి పండగ విశిష్టత తెలుపుతూ ఏవీఎన్ కళాశాల విద్యార్థులు మంగళవారం మినీ సంక్రాంతిని ఉత్సాహంగా..ఉల్లాసంగా జరుపుకున్నారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా అలంకరించి ముందే సంక్రాంతి పండగను విద్యార్థులు..అధ్యాపక..అధ్యాపకేతర సిబ్బంది ఆనందోత్సహాల మధ్య జరుపుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానూజీరావు, ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాల గూర్చి ఇప్పటి తరం పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. వేడుకల్లో డూడూ బసవన్నలు..కొమరదాసు, హరిదాసుల సందడి ఆకట్టుకుంది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి సంబరాల్లో ఆనందంగా పాల్గొన్నారు. ఆట పాటలతో అందర్నీ ఆకట్టుకున్నారు. హరిదాసు, గంగిరెద్దుల విన్యాసాలు, కొమ్మదాసుల కార్యక్రమాలు పైడిరజని పర్యవేక్షణలో జరిగాయి. కళాశాల డీన్ జి.శంకరనారాయణ, అధ్యాపకుడు గాంధీ, కృష్ణవేణిల, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణుడిని వెంటాడుతున్న విద్యార్థినులు



ముగ్గులకు రంగులు అద్దుతూ..



ముగ్గులను తిలకిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

కేజీహెచ్‌లో ముగ్గుల పోటీ

మహారాణిపేట (విశాఖ దక్షిణ): కేజీహెచ్‌లో నర్సింగ్ స్టాఫ్, ఇతర విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు మంగళవారం సంక్రాంతి ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. కేజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరైన కలెక్టర్ మల్లికార్జున ఆసక్తిగా ముగ్గులను పరిశీలించారు. ముగ్గుల పోటీకి కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ అరుణ్య న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, నర్సులు డి.లక్ష్మి, ఎం.ప్రశాంతి, పి.వరలక్ష్మి, పి.ఉషారాణి, కరాటే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులు

- పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్
- ముగిసిన జర్నలిస్టుల క్రీడాపోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీపీ శ్రీకాంత్

విశాఖ స్పోర్ట్స్: జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ అన్నారు. పోర్ట్‌స్టేడియంలో జరుగుతున్న అంతర మీడియా క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగర శాంతి భద్రత పరిరక్షణలో జర్నలిస్టులు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తపించే జర్నలిస్టులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ జర్నలిస్టులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం మెరుగ్గా ఉంటుందన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. మంగళవారం జరిగిన క్రికెట్ పోటీల ఫైనల్స్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కెమెరామెన్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన ఆంధ్రజ్యోతి జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 81 పరుగులకు ఇన్నింగ్స్ ముగించింది. సాక్షి, ఆంధ్రప్రభ జట్లు ఉమ్మడి సెకండ్ రన్నరప్స్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, విస్తా ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయ ఆదాయం రూ.4.54 కోట్లు

- రికార్డు స్థాయిలో సమకూరిన ఆదాయం
- మార్గశిర మాసోత్సవాలు విజయవంతం
- వెల్లడించిన ఆలయ ఈవో శిరీష



మాట్లాడుతున్న ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ కొల్లి సింహాచలం

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల ఆదాయం రికార్డు స్థాయిలో వచ్చింది. గత ఏడాది ఆదాయాన్ని పరిశీలిస్తే ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. గతేడాది రూ.4,22,99,677 ఆదాయం రాగా..ఈ ఏడాది ఆదాయం ప్రసాదం, అన్నదానం, దర్శనాలు, కేశఖండన, విరాళాలు, సేవలు, ఉభయపూజలు ద్వారా రూ.4,54,36,024 వచ్చింది. గతేడాది కన్నా ఈ ఏడాది రూ.31 లక్షల 36 వేల 347 అధికంగా వచ్చింది. భక్తుల సంఖ్య కూడా విశేషంగా పెరిగింది. నెల రోజుల్లో సుమారు 15 లక్షల మంది పైబడే అమ్మవారిని దర్శించుకున్నట్టు అంచనా వేసినట్టు ఈవో కె.శిరీష తెలిపారు. నెల రోజుల పాటు జరిగిన ఉత్సవాలు విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. మార్గశిర మాసోత్సవాలు విజయవంతమయ్యేందుకు కృషి చేసిన పోలీస్ శాఖ, జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్, ఫైర్ సర్వీస్, రెవెన్యూ, దేవాదాయశాఖ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు మళ్ల ధనలత, బోదిలపాటి సత్య రూపవాణి, బుద్ధల అనురాధ, బెహర వెంకటరత్నం, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సురేష్, పలువురు ధర్మకర్తలు, సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, కార్యనిర్వాహక ఇంజనీరు సీహెచ్‌వీ రమణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): పండగల వేళ ప్రయాణికుల సౌకర్యార్థం నాందేడ్ - బ్రహ్మపూర్ - నాందేడ్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రస్తుతం నడుస్తున్న స్పెషల్ రైళ్లు జనవరి నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్ - బ్రహ్మపూర్ (07431) స్పెషల్ నాందేడ్‌లో (ప్రతీ శనివారాలలో) జనవరి 21, 28న మధ్యాహ్నం 3.25 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి బయల్దేరి అదేరోజు (ఆదివారం) మధ్యాహ్నం 2.30 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్ - నాందేడ్ (07432) స్పెషల్ బ్రహ్మపూర్‌లో జనవరి 22, 29 తేదీల్లో (ప్రతీ ఆదివారాలలో) సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9.35 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి మరుసటి రోజు (సోమవారాలలో) మధ్యాహ్నం 3.45 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.

ఈ స్పెషల్ రైళ్లు ఇరుమార్గాల్లో ముద్కేడ్, ధర్మబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస స్టేషన్లలో ఆగుతాయి.

సికింద్రాబాద్ - కటక్ (07165) స్పెషల్ సికింద్రాబాద్‌లో (ప్రతీ శుక్రవారాలలో) జనవరి 20, 27 తేదీలలో రాత్రి 8.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి బయల్దేరి అదే రోజు (శనివారం) సాయంత్రం 5.45గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కటక్ - సికింద్రాబాద్ (07166) స్పెషల్ కటక్‌లో జనవరి 21, 28 తేదీల్లో (ప్రతీ శనివారాలలో) రాత్రి 10.30గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి బయల్దేరి అదేరోజు రాత్రి 8.30 గంటలకు (ఆదివారాలలో) సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఇరుమార్గాల్లో కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళంరోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్, భువనేశ్వర్ స్టేషన్లలో ఆగుతాయి.

సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోండి

బీజేపీ ఐటీ విభాగానికి సోము వీర్రాజు సూచన



మాట్లాడుతున్న సోము వీర్రాజు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): బీజేపీ ఐటీ విభాగం సభ్యులంతా పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా వేదికను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పిలుపునిచ్చారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన పార్టీ ఐటీ విభాగం ప్రతినిధులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని, అభివృద్ధి కార్యక్రమాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి అనేక ప్రాజెక్టులను అందిస్తోం దన్నారు. కేంద్ర సంస్థల ఆధునీకరణ, రోడ్లు, పథకాలు అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ అంశాలను గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లడానికి సోషల్ మీడియా మంచి సాధనం అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతు సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రానికి ప్రధాని వందే భారత్ రైలును సైతం అందిస్తున్నారన్నారు. ఇలాంటి అంశాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా విస్తృతంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు లాల్‌సింగ్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాభారతి సహకారంతో ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ప్రతినిధులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ తెలిపారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రోజు ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామని తెలియజేశారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య ప్రసన్న కుమార్ హాజరవుతారన్నారు. ప్రముఖ మృదంగ విద్వాంసుడు వంకాయల వెంకటరమణమూర్తిని సంగీత కళాభారతి బిరుదుతో సత్కరించనున్నామని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం షోడశ వీణల(16 వీణల)పై త్యాగరాజ కృతులతో వీణా విద్వన్మణి మల్లాప్రగడ జోగులాంబకు నీరాజనం సమర్పిస్తామని తెలియజేశారు. ఈ నెల 12న ఉదయం 7గంటలకు కళాభారతి వీధుల్లో త్యాగరాజ స్వామి ఊరేగింపు మహోత్సవం నిర్వహిస్తామన్నారు. నాదస్వర వాయిద్యాల మధ్య 200 మంది కళాకారులు త్యాగరాజ కృతులను గానం చేస్తూ ఉండగా ఊరేగింపు సాగుతుందన్నారు. మిగిలిన రోజుల్లో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కచేరీలు కొనసాగుతాయన్నారు. ఆఖరి రోజు 16న రాత్రి 8గంటలకు హనుమాన్ చాలీసా, చతుర్వేద పారాయణం, ఆంజనేయస్వామికి వడమాల సమర్పణతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ఈ ఉత్సవాలకు టాప్ ఏ గ్రేడ్ కళాకారులు ఆరుగురు, ఏ గ్రేడ్ కళాకారులు 13 మంది, బి హై 17 మంది, బి గ్రేడ్ 10 మంది కళాకారులు పాల్గొంటున్నారన్నారు.

ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్) ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి కోసం అసిస్టెంట్ ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ సహకారంతో రెండు నెలల కాలపరిమితితో శిక్షణ ఇస్తున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ వద్ద ఉన్న నేక్ శిక్షణా కేంద్రంలో నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు గల అభ్యర్థులు 8500502395, 9866883199 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.